# అభిప్రాయబేధం

ఆయనకు కూతురు తప్ప ఇంకెవరూ సంతానము లేదు. ఆయన వడ్డీ వ్యాపారం చేసే షాహుకారు వద్ద గుమాస్తా. ఆయన ద్వారానే షాహుకారు బదుళ్లు ఇచ్చేవాడు. ఆయనే పద్దులు వ్రాసేవాడు. అప్పులు వసూళ్లు చేసేవాడు. ఆయనకు ముప్పయి రూపాయల జీతం. ఇదిగాక నూటికి రూపాయచొప్పున తాను బదులిప్పించిన వారిదగ్గర నుంచి రుసుము వసూలు చేసేవాడు. దానాదీనా ఆయన జీవయాత్ర గడుపుతున్నాడు. ఇల్లు కొన్నాడు, తోట వేయించాడు.

ఈ మధ్యనే ఆయన భార్యకొక కాసులపేరూ, కూతురికొక కంటె చేయించాడు. కూతురు కంటె పెట్టుకొని ఆడుకొంటూంటే తల్లిదండ్రులు చూచి సంతోషించేవారు. కూతురికి ఆయిదోఏడు.

ఆ ప్రాంతాన యూనాదిమనిషి కాపురముంది. ఆమెకు ఒక కూతురు. ఆ కూతురికి మూడోయేడు. రెండు సంవత్సరములైనది భర్త ఆమెను వదలిపెట్టి ఎక్కడికోవెళ్లి. అప్పటి నుంచి ఆ యూనాదిమనిషి దొరికినప్పుడు కూలీనాలీ చేసుకొంటూ ఏ చెట్టుకిందో ఏ పంచనో నిద్రపోతూ కూతురిని పెట్టుకుని కాలక్షేపం చేస్తూ ఉన్నది. రెండు మూడు రోజుల పాటు తిండి దొరకనప్పుడూ కూతురుని పోషించడానికి మార్గం కనపడక ఆమె వీధుల వెంట ముష్టికి బయలుదేరేది.

ఆ యూనాదిమనిషికి ఆ కూతురే సర్వమూ, ఇరుగుపొరుగు వాళ్లను యాచించి తెచ్చుకొన్న చిరుగుచొక్కాలతోనూ, పరికిణీలతోనూ కూతురుకు ముస్తాబు చేసేది. ముస్తాబు చేసిన కూతురిని చూచి ఆ తల్లి హృదయం ఉప్పొంగేది.

నల్లని, నున్నని, బూడిద అంటిన శరీరం, చిక్కుకట్టిన నల్లని జుట్టూ, తళతళలాడి నవ్వేకళ్లు, అకారణముగా పెదవులు విడిపడడం చేత కలిగిన నవ్వూ రోజూరోజూ చూచే ఆమెకు భర్తలేని లోపం కనిపించలేదు. దీనికితోడు కొంత ముస్తాబు కూతురికి చేస్తేకాని ఆ తల్లికి మనశ్శాంతి లేకపోయేది.

అందుకని బయళ్లలో వికసించిన తంగేడు పువ్వులు తీసుకువచ్చి ఆమె కూతురికి చెవులో జూకాలుంచేది, మెళ్లో పేరులు వేసేది.

ఒకమారు పచ్చగన్నేరు పువ్వులూ, ఒక మారు తురాయి పువ్వులూ, ఒకమారు తంగేడు పువ్వులూ సంపాదించి కూతురికి ముస్తాబు చేసేది. కాని ఆమెకు ఇంకా తృప్తి కలగలేదు. కారణం ఏమిటంటే?

పండుగలకూ పబ్బాలకూ నాగరీకుల పిల్లలు బంగారు నగలు ధరించడం ఆమె చూచింది. అవి చాలా బాగున్నవని ఆమె అనుకుంది. తన కూతురు కూడా అలాంటి నగలు పెట్టుకుంటే ఎంత బాగుంటుందో - ఎంత బాగుంటుందో! ఆ పూటకు తిండి లేని ఆ యూనాదిమనిషికి బంగారు నగలు ఎక్కడ నుంచి వస్తవి?

సంవత్సరాదినాడు అందరూ ముస్తాబైనారు. అందరూ వేపపువ్వు తిన్నారు.

ఆ యానాదిమనిషికి సంవత్సరానికి ఇతర దినములకూ తేడా ఏమీ లేదు. అన్ని రోజులూ ఒక్కటే. అన్ని రోజులూ తిండికీ బట్టకూ తాపత్రయపడవలసిన రోజులే.

అప్పుడు తంగేడు పువ్వులు పూయడం లేదు. రాధామనోహరం పువ్వులూ నందివర్ధనం పువ్వులూ కలవు. వాటితోటే ఆమె కూతురికి అలంకరించింది. కాని వెనుకటి కోరిక ఇంకా సఫలం కాలేదు. తన కూతురికి బంగారు నగలుంచి ముస్తాబు చేసి ముద్దు పెట్టుకుంటే - ముద్దు పెట్టుకుంటే -

ఆనాడు మధ్యాహ్నం కూతురిని చంకను పెట్టుకొని వీధివెంట నడచి వెళుతున్నది యానాదిమనిషి. కూతురు తల్లితో ఏవేవో ఊసులాడుతున్నది.

ఒక చోట అంటే ఆయన షాహుకారు దగ్గిర గుమాస్తా - కూతురు ఆడుకుంటున్నది. కంటె మెళ్లో పెట్టుకొని ఆడుకొంటున్నది. ఆ యానాదిమనిషి ఆ పిల్లను చూచింది. తన కూతురికి - ఆ కంటె - అలాంటి కంటెపెడితే - పెడితే ఎంత బాగుంటుందో - అలాంటి కంటె ఎలాగ పెట్టడం? పోనీ ఆ కంటె పెట్టితే - అమ్మో! ఆ కంటే?

ఆ తల్లి ప్రాణం ఉండబట్టింది కాదు. ఆ యానాదిమనిషి ఆ పిల్ల దగ్గరికి వెళ్లింది. పళ్లుపెడతానని మంచిమాటలాడింది. మెళ్లో కంటె తీసింది. తన కూతురు మెళ్లో పెట్టింది. చూచింది. తల్లి ప్రాణం కుదుట పడింది. తన కూతురిని ముద్దు పెట్టుకొంది. కాని ఒక సందేహం కలిగింది. తంగేడు పువ్వులవల్ల కలిగే అందం కంటే ఈ కంటెవల్ల ఏమి ఎక్కువ అందం కలిగింది? ఎందుకో ఈ భాగ్యవంతులు ఈలాంటి నగలు పెట్టుకుంటారు?

కంటె మెళ్లో నుంచి తీసిన గుమాస్తా కూతురు కెవ్వున కేకవేసింది. యానాదిమనిషి భయపడింది. ఆ పిల్లకేక విన్నవాళ్లు వెంట పడ్డారు. పట్టుకున్నారు. తన్నినారు చితకామతకా ఆ యానాదిమనిషిని.

కంటె తీసినట్లు ఆమె ఒప్పుకుంది. కాని కారణం చెప్పింది కాదు. ఆమె కూతురు మెళ్లో కంటె వాళ్లు తీసుకున్నారు. కూతురు ఏడ్చింది. యానాదిమనిషి కూతురు ఏడ్పువిని జాలి చెందింది.

పొట్టగడవక ఆమె దొంగతనం చేసిందని పోలీసు వాళ్లకు ఆమెను అప్పచెప్పారు.

గుమాస్తా న్యాయముగా సంపాదించిన డబ్బుతో చేయించిన కంటె అన్యాయంగా దొంగిలించినందుకు యానాదిమనిషి కొంతకాలం చెరసాలలో కూతురుతోపాటు కూడా ఉండవలసి వచ్చింది. దొంగతనము చేసినందుకని ప్రజలన్నారు. తన కూతురికి ముస్తాబు చేసినందుకని ఆమె అనుకున్నది.